


సంచలన సాయంకాల పత్రిక


# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 11-6-2025

సంపుటి: 21 సంచిక: 67
పేజీలు: 8 వెల: రూ.1

## జీవోలో సొమ్ములు..
# కాంట్రాక్టర్ జేబుకు చిల్లులు


RONALD ROSE DIN...
GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT
Budget Estimates 2025-26 - Budget Release Order for Rs. 12,80,20,00,000 /- (Rupees One thousand two hundred eighty crore twenty lakh) to Rural Development Department - Orders - Issued
FINANCE ( FMU-PR&RD,RWS ) DEPARTMENT
G.O.Rt.No: 1811 Dated:06-06-2025
Read the following:-
1. G.O.Ms.No.101, Finance (Budget-I) Department, 12-08-2015
2. GO Ms.No.3, Finance (Budget-I) Department, 08-01-2025
3. GO Ms.No.12, Finance (Budget I) Department, 31-03-2025
4. GO Ms.No.14, Finance (Budget I) Department, 05-04-2025
5. Mother sanction No.L-15080/08/2025-RL-VII/Sl.No.7, MoRD,GoI, 04-06-2025
ORDER:-
In pursuance of the orders issued in references read above, the Commissioner, Rural Development Department is hereby issued a Budget Release Order For an amount of Rs.12,80,20,00,000 /- (Rupees One thousand two hundred eighty crore twenty lakh) from the BE provision 2025-26 for the purpose of 1st installment of 1st tranche of Central Assistance towards MGNREGS Material component for Financial Year 2025-26 in relaxation of quarterly regulation.
(Rs.in Lakhs)

| S.No. | Head of Account | Charged/ Voted | Provision in BE 2025-26 | Additional Amount Sanctioned | Amount Reappropriated | Total Provision in BE 2025-26 | Amount Already Authorised | Amount Authorised Now | Balance Amount Available |
|---|---|---|---|---|---|---|---|---|---|
| Scheme Name: Mahatma Gandhi National Rural Employment Guarantee Programme (AP123) | | | | | | | | | |
| Procedure of Drawal of Funds: Detailed Voucher Bill | | | | | | | | | |
| 1 | 25050210125053 10312 | V | 4,25,845.00 | 0.00 | 0.00 | 4,25,845.00 | 0.00 | 1,28,020.00 | 2,97,825.00 |
| | | Total | 4,25,845.00 | 0.00 | 0.00 | 4,25,845.00 | 0.00 | 1,28,020.00 | 2,97,825.00 |


The (Panchayat Raj and Rural Development Secretariat) Shall take necessary action for issue of administrative sanction as per instructions issued in U.O Note No. 29875 /A1/1283/A1/BG.I/2006, Finance (BG.I) Department, dt.25.11.2006.
(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF ANDHRA PRADESH)

- ఇంకా గ్రౌండ్ కాని 1800 పైచిలుకు పనులు
- జీవో విడుదలైనా జమకాని నిధులు
- జిల్లాలో రూ.91 కోట్లకు కేవలం రూ.19 కోట్లే చెల్లింపు
- మెటీరియల్ కాంపొనెంట్ బిల్లులు రాక గగ్గోలు
- ప్రభుత్వంపై పెరుగుతున్న ఎమ్మెల్యేల ఒత్తిడి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సంక్షేమ పథకాలకే ప్రాధాన్యత ఇచ్చి, కనీసం రోడ్ల మరమ్మతుకు కూడా ముందుకు రాని వైకాపా ప్రభుత్వాన్ని గత ఎన్నికల్లో ఓడించిన తర్వాత అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా నడుపుతామంటూ రాష్ట్రాన్ని పాలిస్తున్న కూటమి ఏడాది కాలంలో అభివృద్ధి పనులు చేపడుతున్నా బిల్లుల చెల్లింపులో మాత్రం వైకాపా పంథానే అనుసరిస్తుంది. ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో బేలచూపులు చూస్తుంది. తాజాగా ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ కింద జరిగిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు రూ.2,500 కోట్లు విడుదల చేసినట్లు ప్రభుత్వం ఈ నెల ఆరున ఒక జీవో విడుదల చేసింది. కానీ ఇప్పటి వరకు ఇందుకు సంబంధించిన నిధులు జమ కాలేదు. 2,500 కోట్లలో 1,250 కోట్ల వరకే చెల్లిస్తారని కొందరు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని ప్రకటించారు. ప్రస్తుతం అంతో ఇంతో రోడ్లు, కాలువల

- మిగతా చివరి పేజీలో


భామిని మండలం పాలిష్ కోట పంచాయతీ జక్కరగూడ గ్రామానికి గత దశాబ్ద కాలంగా రోడ్లు లేకపోవడం శోచనీయం. ఈ గిరిజన గ్రామాలకు కాంట్రాక్టర్ మూడున్నర నెలల క్రితం రోడ్డును తవ్వి వదిలేసి పనులు ప్రారంభించకపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై అధికార యంత్రాగం, నాయకులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కొలిక్కొవచ్చిన 'సెమాగ్లుటైడ్' చోరీ కేసు



- ఎనిమిది మంది నిందితులు అరెస్టు
- 450 గ్రాములు ఫార్మా ప్రొడెక్ట్ స్వాధీనం
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ ఏడాది మార్చి నెలలో పైడిభీమవరంలోని డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కంపెనీలో చోరీకి గురైన రూ.2కోట్లు విలువైన 450 గ్రాముల 'సెమాగ్లుటైడ్' కేసు ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. ఈమేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి విలేకర్లు సమావేశం నిర్వహించి 'సెమాగ్లుటైడ్' దొంగిలించిన 8 మంది నిందితులను మీడియా ముందుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా ప్రొడక్ట్ చోరీ కేసును జె.ఆర్.పురం పోలీసులు ఛేదించి 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి 450 గ్రాముల 'సెమాగ్లుటైడ్'ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల్లో నలుగురు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్‌లో పని చేస్తున్న ఉద్యోగులేనని తెలిపారు. చోరీకి గురైన సెమాగ్లుటైడ్ అనే ఫార్మా ప్రొడక్ట్ టైప్-2 డయాబెటిస్ చికిత్సకు, దీర్ఘకాలిక బరువు నియంత్రణకు ఉపయోగించే ఔషధమని, ఈ ప్రొడక్ట్ ఇతర దేశాలకు ఉత్పత్తి చేయబడిన పూర్తి పేటెంట్ ఔషధమన్నారు. దీని మార్కెట్ విలువ రూ.2కోట్ల ఉంటుందన్నారు. కేసు విచారణకు స్పెషల్ టీంను నియమించి మూడు నెలలు సమగ్ర దర్యాప్తు చేపట్టి దొంగతనంలో 8 మంది భాగస్వాములను గుర్తించామన్నారు. వీరిలో కంపెనీకి చెందిన సీటీవో 6, ఎఫ్‌జి వేర్‌హౌస్ వద్ద సురేష్, రాఘవేంద్ర, 3 అప్పలనాయుడు, 4 కాంతారావు అనే నలుగురు ఉద్యోగులుగా పని చేస్తున్నారు. ఇందులో రాఘవేంద్ర అనే వ్యక్తి ప్రొడక్ట్‌ని దొంగతనం చేసి అప్పలనాయుడుకు ఇచ్చినట్టు గుర్తించామన్నారు. దొంగిలించిన ప్రొడక్ట్‌ను అప్పలనాయుడు డిస్పోజల్ చేయమని సురేష్‌కు ఇచ్చినట్టు తెలిపారు. సురేష్ విశాఖపట్నంలోని దువ్వాడలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్‌లో పని చేస్తున్న కాంతారావుకి అందజేశాడని, కాంతారావు దాన్ని హైదరాబాదులోని ఫార్మా కంపెనీలో పని చేస్తున్న తిరుపతి అనే వ్యక్తికి ఇచ్చి విక్రయించాలని సూచించాడు. తిరుపతి ఆ ప్రొడక్ట్‌ను నిర్ణీత సమయంలో విక్రయించకపోవడంతో జి.సురేష్ రెడ్డికి దాన్ని అందజేశారు. సురేష్ రెడ్డి గతంలో అరబిందో కంపెనీలో పనిచేస్తూ పెల్లాడియం అసిటెట్ అనే

- మిగతా చివరి పేజీలో



## సిరిమానుకు అండగా
# స్వయం సేవకుడిగా!

- అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే గొండు విశేష సేవలు
- అన్నింటా తానే ముందుండి నడిపించిన వైనం
- ఎలాంటి ఇబ్బందుల్లేకుండా సజావుగా సిరిమాను యాత్ర
- విద్యుత్తు, పోలీసు యంత్రాంగం పనితీరు ప్రశంసనీయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మంగళవారం మధ్యాహ్నం.. సమయం 3.30 గంటలు..

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాతశ్రీకాకుళం అమ్మవారి పండుగల ఊరేగింపు సందర్భంగా ఘటం మోసి, స్థానికులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం వేరే కార్యక్రమానికి వెళ్లిపోయారు.

అంతవరకు అతని పక్కనే ఉన్న స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అక్కడి నుంచి తన పని మొదలుపెట్టారు. తనే ఒక ఎలక్ట్రీషియన్ అయ్యారు.. తనే ఒక రోప్ పార్టీ కానిస్టేబుల్ అయ్యారు.. తనే కొత్తపేటలో ఒక టీడీపీ కార్యకర్త ఇంటికి అతిథిగా వెళ్లారు.

హోదాను, స్థాయిని పక్కన పెట్టి ప్రజలతో మమేకమైతే ఫలితం ఎలా ఉంటుందో పదేళ్ల తర్వాత జరిగిన పాతశ్రీకాకుళం అమ్మవారి పండగలు నిరూపించాయి. ఇలా చేస్తే మరోసారి ఎమ్మెల్యే అయిపోతారా? అంటే.. దానిపై చర్చించే సందర్భం కాదిది. ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న నేత ఓటు బ్యాంకు రాజకీయం మాత్రమే చేయొచ్చు. అలా అయితే కచ్చితంగా గెలుస్తారు. కానీ సామాన్యుడిలా సమూహంలో కలిసిపోయి అందరిలో తానూ ఒకడిని అన్నట్లు వ్యవహరించడంపైనే ఈ కథనం.

### విద్యుత్ లైన్ల మార్పు

అమ్మవారి పండుగలు పెద్ద ఎత్తున జరుపుతామని నిర్వాహకులు ప్రకటించిన వెంటనే లోకల్ ఎమ్మెల్యేగా గొండు శంకర్ అప్రమత్తమయ్యారు. ఉత్సవాల్లో భాగంగా 32 అడుగుల పొడవు ఉండే సిరిమానులను పాతశ్రీకాకుళంలోని ఇరుకు రోడ్లలో ఊరేగిస్తే ఇబ్బంది ఎదురవుతాయని గ్రహించిన ఎమ్మెల్యే మొదటిగా విద్యుత్ శాఖపై దృష్టి సారించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, కొన్నింటి ఎత్తు పెంపు, కొన్నిచోట్ల స్థలం మార్పు వంటి సూచనలు చేశారు. ప్రస్తుతం వీధుల్లో ఉన్న కరెంటు స్తంభాల కంటే పొడవైన స్తంభాలు వేసి, పైన క్లాంప్ బిగించి విద్యుత్ సర్వీస్ లైన్లను మార్పించారు. ఈ చర్యల వల్ల ఎక్కడా విద్యుత్ వైర్లు తెగిపోయే సమస్య ఉత్పన్నం కాలేదు. అయితే ఆ పైనుంచి హెచ్‌టీ లైన్స్ వెళ్లడం వల్ల సహజంగానే ముందు జాగ్రత్తగా ఈపీడీసీఎల్ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే సిరిమాను వెళ్లిపోయిన ప్రాంతాలకు వెంట వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి ఎమ్మెల్యే శంకర్ చొరవ తీసుకున్నారు. విద్యుత్ శాఖ డీఈ, ఏఈ, లైన్‌మెన్‌లను తనే వెంటబెట్టుకుని తిరుగుతూ లైన్ ఆన్ చేయించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద హరిజన వీధిలో ఊరేగింపు జరిగినప్పుడు విద్యుత్ వైర్ల సమస్య తలెత్తకపోయినా కేబుల్ టీవీ, ఇంటర్నెట్ వైర్లు అడ్డు తగిలాయి. వీటిని తొలగించాలని విద్యుత్ సర్వీస్ వైర్లు మార్చినప్పుడే స్థానిక కేబుల్ ఆపరేటర్లకు అధికారులు, నిర్వాహకులు సమాచారం ఇచ్చారు. కానీ చాలా ప్రాంతాల్లో వారు స్పందించలేదు. దీంతో ఇరుకుగా ఉండే హరిజన వీధిలో ప్రాంతంలో ఊరేగింపు సాగడం కష్టమైంది. ఆలస్యం కూడా అక్కడే అయింది. దీంతో కేబుల్ వైర్లను కట్ చేసి పడేశారు. అడ్డొచ్చిన ప్రతిచోటా కేబుళ్లను విద్యుత్ సిబ్బందే కట్ చేసి పక్కన పడేశారు.

### ట్రాఫిక్ నియంత్రణలో సక్సెస్

పదేళ్ల క్రితం.. అంటే 2015లో జరిగిన ఉత్సవాల్లో సిరిమాను ఒకవైపు వెళ్లడానికే రాత్రి 11 గంటలు అయ్యింది. తిరిగి వెనక్కు వెళ్లే సమయం రాత్రి ఒంటిగంట. కానీ ఈసారి 10.30 గంటలకే మొత్తం ఉత్సవం ముగిసిపోయింది. దీనికి ప్రధాన కారణం పోలీసుల ముందుజాగ్రత్త చర్యలే. మధ్యలో ఎక్కడా ఊరేగింపు నిలిచిపోకుండా రోప్‌పార్టీని పెట్టి ముందుకు నడిపించారు. దూరప్రాంతాల నుంచి వచ్చినవారిని పొట్టిశ్రీరాములు జంక్షన్ నుంచే అడ్డుకుని వెనక్కి పంపడం ఇబ్బంది కలిగించినా.. ఈ నిర్ణయం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సిరిమాను ఊరేగింపు సజావుగా, త్వరగా ముగిసింది. పాతబస్టాండు, మేదరవీధి, మొండేటివీధి, మంగువారితోట, కంపోస్టు కాలనీ లాంటి ప్రాంతాల మీదుగా పాతశ్రీకాకుళం చేరుకోవాల్సి ఉండటంతో చాలామంది కార్లను ఇళ్లలోనే వదిలేసి ద్విచక్ర వాహనాలపై దూరప్రాంతాల నుంచి వచ్చారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగలేదు. డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, ట్రాఫిక్ సిబ్బంది, శాంతి భద్రతలు చూసే పోలీసులు ప్రతి జంక్షన్‌లోనూ మోహరించడం వల్ల అడ్డదారుల్లో వచ్చే ప్రయత్నం ఎవరూ చేయలేకపోయారు. దీంతో సిరిమాను ఎంత తొందరగా వచ్చిందో, అంత తొందరగా వెళ్లిపోయింది.

### ఎక్కడ సమస్య ఉంటే అక్కడ ప్రత్యక్షం

ఒకటి రెండుచోట్ల ఇబ్బందులు తలెత్తితే, ఆ పరిసరాల్లోనే ఉన్న ఎమ్మెల్యే గొండు శంకర్ వెంటనే అక్కడకు చేరుకొని క్లియర్ చేయడం కనిపించింది. ఉత్సవాలకు కొద్ది రోజుల ముందే కుందనంపేట వంటి సందుల్లో రోడ్డుకు, కాలువకు మధ్యనున్న ప్రాంతాన్ని కూడా సిమెంట్‌తో కప్పి రోడ్డు వెడల్పయ్యేలా చేశారు. అన్నిటికీ మించి మంగళవారం సిరిమానోత్సవం, తర్వాత బుధవారం చాలామంది భోజనాలు పెట్టుకోవడం వల్ల పెద్ద సమస్యలేవీ తలెత్తలేదు. ఎక్కడా సర్వీస్ వైర్లను కర్రలతో పైకెత్తి ఊరేగింపును కొనసాగించడం, ఈలోగా సర్వీస్ వైర్లు తెగిపోవడం వంటివి చోటుచేసుకోపోవడం వల్ల సిరిమాను చకచకా కదిలిపోయింది. ఉత్సవం పూర్తయ్యే వరకు ఉన్న ఎమ్మెల్యే ఆ తర్వాత విద్యుత్ సిబ్బందితో వీధిలోనే సమావేశమై పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో ఇంటింటికీ వెళ్లి పండగ ఏర్పాట్ల మీద అసంతృప్తి ఉంటే చెప్పాలని, తప్పులుంటే దిద్దుకుంటామని కోరారు. వచ్చే ఏడాది అరసవల్లిలో కూడా పండగలు జరుగుతున్నందున పాతశ్రీకాకుళంలో లోపాలు చెబితే, అరసవల్లికి సరిదిద్దుకుంటామని ప్రజలను ఎమ్మెల్యే కోరడం కొసమెరుపు.







● ఎడిటోరియల్

# పడిపోతున్న సంతానోత్పత్తి రేటు

భారతదేశ జనాభా విషయంలో చిత్రమైన గణాంకాలు, విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఒకవైపు ప్రపంచ జనాభాలో మనమే అగ్రస్థానంలో ఉన్నామని చెబుతున్న ఐక్యరాజ్యసమితి.. మరోవైపు దేశంలో జనాభా సర్దుబాటు రేటు తగ్గుతోందని హెచ్చరిస్తోంది. ఇక జనాభాను తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. కొన్ని రాష్ట్రాలు మాత్రం జనాభా పెరుగుదలకు ఊతమిచ్చేలా వ్యవహరిస్తున్నాయి. ఈ పరిణామాలను విశ్లేషిస్తే వేర్వేరు కారణాలు ఈ పరిస్థితులకు దోహదం చేస్తున్నాయని అర్థమవుతోంది. ఈ ఏడాది మనదేశ జనాభా 146కోట్లకు చేరుకుందని ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన వార్షిక జనాభా నివేదిక పేర్కొంది. అయితే దేశంలో రీప్లేస్‌మెంట్ రేటు కంటే సంతానోత్పత్తి రేటు తగ్గిపోతున్నట్లు వెల్లడించింది. స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ (ఎస్‌ఓడబ్ల్యూపీ) నివేదిక సంతానోత్పత్తి తగ్గడం వల్ల కలిగే భయాందోళనల నుంచి పునరుత్పత్తి లక్ష్యాలు సాధించడం వైపు దృష్టి మరల్చాలని పిలుపునిచ్చింది. లక్షలాది మంది ప్రజలు తమ నిజమైన సంతానోత్పత్తి లక్ష్యాలను సాధించలేకపోతున్నారని నివేదిక పేర్కొంది. తక్కువ జనాభా లేదా అధిక జనాభా.. అనేది నిజమైన సంక్షోభం కాదని, సంతానోత్పత్తి తగ్గడమే అసలైన సంక్షోభమని యూఎన్ రిపోర్టు వివరించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు సగటున 1.9 జననాలకు తగ్గిందని.. ఇది వాస్తవ సగటు 2.1 కంటే తక్కువని పేర్కొంది. జననాల రేటు మందగించినప్పటికీ దేశంలో యువ జనాభా గణనీయంగానే ఉంది. 0-14 ఏళ్ల వయస్కులు 24 శాతం, 10-19 మధ్య వయస్కులు 17 శాతం, 24 ఏళ్లలోపు వయస్కులు 26 శాతం మంది ఉన్నారు. 68 శాతం దేశ జనాభా (15-64 మధ్య వయస్కులు) పని చేసే సామర్థ్యం కలిగి ఉంది. 65 ఏళ్లు పైబడిన వృద్ధుల జనాభా ఏడు శాతమే ఉంది. అయితే ప్రజల ఆయుఃప్రమాణం మెరుగుపడటంతో రానున్న రోజుల్లో జనాభా మరింత పెరిగే అవకాశం ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం దేశ జనాభా 170 కోట్లకు చేరిన తర్వాతే తగ్గుముఖం పడుతుందని, 40 ఏళ్ల తర్వాతే ఇది సాధ్యమవుతుంది. దీంతో కేంద్ర ప్రభుత్వ జనాభా నియంత్రణకు అనేక చర్యలు చేపడుతోంది. అయితే దానికి భిన్నంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో జనాభా పెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇది ఐక్యరాజ్యసమితి నివేదికకు అనుగుణంగా కనిపిస్తోంది. సంతానోత్పత్తి రేటు తగ్గి రాష్ట్ర జనాభా తగ్గుతుండటంపై ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. దాంతో పెద్దకుటుంబాలను ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి దీన్ని సూచనప్రాయంగా ప్రస్తావించారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులను చేస్తూ గతంలో చట్టాన్ని సవరించారు. ఇప్పుడు దాన్ని మళ్లీ సవరించే అవకాశం ఉంది. సంతానోత్పత్తి రేటు పెంచడానికి వీలుగా పెద్ద కుటుంబాలకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం ఆలోచిస్తోంది. కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి ఆర్థిక సహాయం అందించడానికి ఒక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దక్షిణ భారత రాష్ట్రాల జనాభా దృష్ట్యా విధానాల్లో మార్పు అవసరమని అన్నారు. ప్రస్తుత సంతానోత్పత్తి రేటు ఇలాగే కొనసాగితే రాష్ట్రం తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన అన్నారు. ముఖ్యంగా జనాభా ప్రాతిపదికన జరిగే పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనలో ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కొన్ని దశాబ్దాలుగా జాతీయ కార్యక్రమంగా అమలు చేస్తున్న జనాభా నియంత్రణను ఉత్తరాది రాష్ట్రాలు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆ రాష్ట్రాల్లో జనాభా రేటు పెరుగుతూ పోతోంది. అదే కు.ని. కార్యక్రమాలను కచ్చితంగా నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు తగ్గుతోంది. ఇది ఉత్తర, దక్షిణ భారతాల మధ్య పథకాల నిర్వహణ, నిధుల మంజూరు, మౌలిక సౌకర్యాల కల్పనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే కొన్ని రాష్ట్రాలు జనాభా పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సిక్కిం ప్రభుత్వం 2023 నుంచి ఈ చర్యలు చేపట్టింది. అధిక సంతానానికి ప్రోత్సాహకాలు ప్రకటించింది. మిజోరం కూడా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను కనాలని గిరిజనులను ప్రోత్సహిస్తోంది. ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన పార్లమెంటు సీట్లు, నిధులు మంజూరు చేస్తే.. తమిళనాడు ప్రజలు కూడా ఎక్కువ మంది పిల్లలను కనాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు.



మండలంలోని కొండములగాం గ్రామ పంచాయతీ గవర్నమెంట్ హాస్పిటల్ నుండి సీతంవలస వరకు నూతన బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, రణస్థలం

## రైతు సోదరులకు ఏరువాక శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




తొలకరికి సన్నద్ధమవుతున్న రైతులకు ఈ ఏడాదంతా మంచి జరిగి... వ్యవసాయం లాభదాయకంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకాంక్షిచారు. రైతు సోదరులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తున్నామన్నారు. విత్తనం నుంచి ధాన్యం కొనుగోలు వరకు అన్న దాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రైతులు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాల ఆదుకునేందుకు అనేక చర్యలు చేపట్టామన్నారు. ఈ ఏడాది వరుణుడు కూడా కరుణించి ఖరీఫ్‌కు ముందుగానే వర్షాలు కురవడంతో ఖరీఫ్ పనుల సన్నద్ధతకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా అన్నదాతలకు ముందుగానే వ్యవసాయ యాంత్రికరణతో పాటు భూసార పరీక్షలు కూడా నిర్వహించి రైతులకు వారి భూములకు సంబంధించిన ఆరోగ్య పత్రాలను అందజేసి రైతులకు వారి భూసారాలను తెలుసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టామన్నారు. ఏడాదంతా రైతులు ఆనందోత్సాహాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## సరుబుజ్జిలి కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మావతి



(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

ప్రభుత్వ జూనియర్ కళాశాల సరుబుజ్జిలి నూతన ప్రిన్సిపాల్‌గా పైడి పద్మావతి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రిన్సిపాల్‌గా చేరిన వై.శ్రీనివాసరావు శాఖాపరమైన బదిలీల్లో భాగంగా విజయనగరం జిల్లా గుర్ల కళాశాలకు బదిలీ కాగా, పద్మావతి సరుబుజ్జిలిలో బాధ్యతలు స్వీకరించారు. 2001 లో ఏపీపీఎస్సీ ద్వారా పౌరశాస్త్ర అధ్యాపకురాలిగా ఎంపికైన పద్మావతి వంగర, తొగరాం, మెళియాపుట్టి, కింతలి, పొందూరు కళాశాలల్లో పనిచేశారు. మెళియాపుట్టి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది, శాఖాపరమైన బదిలీల్లో భాగంగా సరుబుజ్జిలి వచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉత్తమ ఫలితాలు అందించేందుకు కృషి చేస్తానని పద్మావతి తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించామనీ సైన్స్ ఆర్ట్స్ గ్రూపులతో పాటు ఏ అండ్ టీ వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. సరుబుజ్జిలి, బూర్జ, ఎల్.ఎన్.పేట మండలాలకు కేంద్ర బిందువుగా ఉన్న తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు పనిచేస్తున్నారనీ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ జూనియర్ కళాశాల బలోపేతానికి సహకరించాలని కోరారు. నూతన ప్రిన్సిపాల్‌ను అభినందించిన వారిలో సర్వశిక్ష అభయాన్ ఏపీసి శశిభూషణ్, అధ్యాపకులు నాగేంద్ర, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఆకెళ్ళ రామారావు, రమేష్ సాహు, వినోద్ రాజు, గొండు శ్రీనివాసరావు, విజయ్, స్టేట్ మీడియా కన్వీనర్ దుగ్గివలస రాంప్రసాద్, డీఆర్ సంఘం ప్రతినిధి సోపేటి రమేష్, ప్రిన్సిపాల్స్ మరపట్ల పవన్, గణపతి ధనంజయరావు, జి.తిరుపతిరావు, యూడీసీ రమేష్ తదితరులు అభినందించారు.



మాజీ రాజ్యసభసభ్యులు, ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అరసవల్లి సూర్యనారాయణస్వామి, శ్రీకూర్మం పర్యటనకు బుధవారం విచ్చేసిన సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ స్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఆరు నెలల చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

(సత్యంన్యూస్, టెక్కలి)

మండలంలోని స్థానిక కొద్రవీధిలో నివాసముంటున్న నెల్లూరు శ్రీకాంత్, శృతి దంపతుల చిన్న కుమార్తె లవిత్రశ్రీ ప్రాణాంతక కాలేయ వ్యాధితో బాధపడుతుంది. కాలేయ మార్పిడి ఒక్కటే దీనికి చికిత్స అని వైద్యులన్నారు. సుమారు రూ.25లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు. ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలుసుకున్న టెక్కలి అభయం యువజన సేవా సంఘం వాళ్ళు పలువురి దాతల ద్వారా సేకరించిన రూ.60వేలు చిన్నారి తల్లిదండ్రులకు అందజేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు. చిన్నారి వైద్యానికి ప్రతి ఒక్కరు సామాజిక స్పృహతో ముందుకు వచ్చి చేతనైన సాయం చేస్తారని ఆయన కోరారు. సాయం చేయాలనుకున్నవాళ్లు 9494587587, 9441116108 ఫోన్ పే నెంబర్‌కి వేయగలరు. ఈ కార్యక్రమంలో అభయం సేవాసంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, తిరుమల ఫ్యామిలీ మాల్ అధినేత అందవరపు కిషోర్, సంఘ సభ్యులు, అద్దాల వీరభద్రాచారి, ధర్మవరపు పూర్ణాచారి, పిల్లల రమేష్, షణ్ముఖ మాస్టారు, ఎం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



# శ్రేయస్ పిల్లలకు తల్లిని నేనే!

**టీం ఇండియా ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కి ఉన్న ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. టీం ఇండియా జట్టులో ప్రతి ఒక్కరికీ కోట్లాది మంది ఫ్యాన్స్ ఉంటారు. అలాంటిది స్టార్ ప్లేయర్ కావడంతో శ్రేయస్ అయ్యర్‌కి ఫాలోయింగ్ మరింత ఎక్కువ ఉంటుంది అనడంలో సందేహం లేదు. కోట్లాది మంది అభిమానించే శ్రేయస్ అయ్యర్ పై ఒక టీవీ స్టార్ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. చాలా మంది షాక్ అయ్యే విధంగా కూడా ఉన్నాయి. బిగ్‌బాస్ 18 ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న ఈ దుబాయ్ ముద్దుగుమ్మకు శ్రేయస్ అయ్యర్ అంటే అభిమానం కంటే ఎక్కువ. అందుకే అతడిని పెళ్లి చేసుకున్నాను అని ప్రకటించింది.**

తెలంగాణ సర్కార్ దుబాయ్‌లో నివాసం ఉండే నటి ఎడిన్ రోజ్ మాట్లాడుతూ... శ్రేయస్ అయ్యర్‌తో నాకు పెళ్లి అయింది. నా మనసులో ఇప్పటికే నేను అతడికి భార్యగా ఉన్నాను. అతడి పిల్లలకు తల్లిని కూడా అనుకుంటున్నాను. అతడు నా జీవితంలో ఒక భాగంగా ఉన్నాడు. అతడితో జీవితం పంచుకుంటున్నట్లుగానే నేను నా జీవితాన్ని సాగిస్తున్నాను అంటూ షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. అతడికి ఉన్న ఫాలోయింగ్ కారణంగా ఎడిన్ రోజ్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తుందని, కేవలం పబ్లిసిటీ కోసమే ఆమె ఇలా మాట్లాడుతుందని చాలా మంది అనుకున్నారు. కానీ ఆమె మాటల్లో నిజాయితీ కనిపిస్తుందని, ఆమె చేస్తున్న వ్యాఖ్యల్లో ప్రేమ కనిపిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



శ్రేయస్ అయ్యర్ ను వివాహం చేసుకున్నట్లుగా భావిస్తున్నట్లు ఎడిన్ రోజ్ విషయం గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె తన అభిమానంను చాటుకునే విధానం ఇది కాదు అంటూ కొందరు అంటూ ఉంటే, కొందరు మాత్రం ఆమె ఇలా చేయడం ద్వారా శ్రేయస్ అయ్యర్‌ను వివాహం చేసుకోవచ్చు అని భావిస్తూ ఉంటుంది అంటున్నారు. మొత్తంగా శ్రేయస్ అయ్యర్ దృష్టిని ఆకర్షించడం కోసం ఈమె చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్నీ కావు. ఆమె అభిమానంలో, ప్రేమలో నిజాయితీ ఉంటే కచ్చితంగా శ్రేయస్ ఆమెను కలుస్తాడు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రేయస్ ప్రస్తుతం మంచి ఫామ్‌తో క్రికెట్‌లో కొనసాగుతున్నాడు.

బిగ్ బాస్ షో ద్వారా ఇండియన్ బుల్లి తెర ప్రేక్షకులకు చేరువ అయిన ఈ అమ్మడు ముందు ముందు బాలీవుడ్ సినిమాల్లో కూడా నటించే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్, సౌత్ సినిమాల్లో ఆఫర్లు వస్తే కాదు, వద్దు అనకుండా నటించేందుకు రెడీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆకట్టుకునే విధంగా ఉండే ఈ అమ్మడిని నిజంగానే శ్రేయస్ అయ్యర్ పెళ్లి చేసుకోవచ్చు కదా అంటూ కొందరు సరదాగా సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతూ ఉంటారు. ఇంతకు ఈమె గురించి శ్రేయస్ అయ్యర్ ఎలా స్పందిస్తాడు, ఈమె విషయాలు అతడి వద్దకి చేరి ఉంటాయా అనేది తెలియాల్సి ఉంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...





ఏ ప్రోగ్రాం అయినా సరే, కొన్ని అలిఖిత మర్యాదలు, ప్రొటోకాల్స్ ఉంటాయి. పాటించబడాలి.. లేకపోతే అహాల సమస్యలు వస్తాయి, కొత్త తలనొప్పులు క్రియేటవుతాయి.. సీఎం పేరు మరిచిపోతే, దాన్ని వెకిలిగా సమర్థించుకోబోతే అల్లు అర్జునుడు ఎంత భంగపడ్డాడో, ఇండస్ట్రీ అంతా ఎలా షాకయిందో చూశాం కదా.. తాజాగా ఓ సంఘటన. ఫేస్‌బుక్‌లో మిత్రుడు డా.మహ్మద్ రఫీ వాల్ మీద కనిపించింది. ఆసక్తికరంగా ఉంది. ముందు ఆ వార్త చదవండి.

## శ్రీలీల వస్తే మంత్రి స్పీచ్ ఆగిపోవాలా..?

# ఇవే తగ్గించుకుంటే మంచిది!!

ఏదైనా ఒక కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిధిగా వస్తే గొప్పగా వుంటుందా? సినిమా హీరో లేదా హీరోయిన్ వస్తే గొప్పగా వుంటుందా? మారిన కాలంలో సినిమా నటులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది! అమెరికాలో తెలుగు సంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లో రాజకీయ నేతల కన్నా సినిమా నటులకే క్రేజ్ ఉంటుంది! అదే అక్కడ సంప్రదాయంగా కొనసాగుతోంది! ఆ సంప్రదాయమే మన హైదరాబాద్‌కు కూడా వచ్చినట్లు అనిపిస్తోంది! ఇవాళ హైదరాబాద్ లో ఓ హొటల్ లో జరిగిన ఏదో లాంచ్ ప్రోగ్రామ్! తెలంగాణ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమయానికి వచ్చేసారు! మంత్రి వచ్చారు కాబట్టి కార్యక్రమం ప్రారంభించారు. అక్కడ యాంకర్ ఎంతో అనుభవం వున్న ఝాన్సీ! మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతున్నారు! అంతలో హీరోయిన్ శ్రీలీల వచ్చింది! ముందు వరసలో కూర్చుంది! నిర్వాహకులు చెప్పారో తనకే ఆలోచన వచ్చిందో తెలియదు కానీ, మంత్రి దగ్గరకు వెళ్లి "ఏమనుకోవద్దు సార్ చీఫ్ గెస్ట్ శ్రీలీల వచ్చింది. వేదిక మీదకు పిలుద్దాం! ఈ యాప్ ఆమె లాంచ్ చేయాల్సి వుంది" అని మంత్రి స్పీచ్ ఆపేసింది! ఆయన ఎంతో సౌమ్యుడు కాబట్టి, నేను మాట్లాడటం ఆపేయాలా లేదా నేను ఆమెను వేదిక పైకి పిలవాలా అనడిగారు! లేదు సార్ నేనే పిలుస్తాను అంటూ ఝాన్సీ వేదికపైకి శ్రీలీలను ఆహ్వానించింది! ఆమె వచ్చి మంత్రి శ్రీధర్ బాబును పలకరిస్తే, సరే అక్కడ ఉండండి అంటూ స్టేజిలో అతిధులు నిలబడిన చోటు చూపించి, ఆమె అక్కడకు వెళ్ళాక తన ప్రసంగం ప్రారంభించి ముగించారు! ఇలా ఒక మంత్రి మాట్లాడుతున్నప్పుడు ఆపడమే సభా మర్యాద కాదు! ఆపి, అలస్యంగా వచ్చిన హీరోయిన్‌ను హడావిడిగా పిలవడం ఏమిటో ఝాన్సీకే తెలియాలి! కనీసం వేదికపై కుర్చీలు కూడా లేవు! మంత్రి ప్రసంగం అయ్యేంత వరకు ఆమె కింద విఐపిల కోసం ఏర్పాటు చేసిన కుర్చీల్లో కూర్చోబెట్టి, మంత్రి ప్రసంగం అయ్యాక పిలిచి ఉండొచ్చు! ఇదేం మర్యాద! కనీసం సభా మర్యాద కూడా తెలియదనుకోవాలా? లేక మన సినిమా వాళ్ళు అంతే అనుకోవాలా? శ్రీలీల వయసెంత? చేసిన సినిమాలు ఎన్ని? అనుభవం ఎంత? దుద్దిళ్ల శ్రీధర్ బాబు వయసు ఎంత? సుదీర్ఘ అనుభవం వున్న రాజకీయ దిగ్గజం! ఎన్నో సార్లు ప్రభుత్వంలో కీలక మంత్రిగా వ్యవహరించిన నేత! ప్రస్తుతం ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి! అలాంటిది శ్రీలీల వచ్చిందని ఆయన ప్రసంగాన్ని మధ్యలో ఆపేయించడం ఆశ్చర్యం! కాసేపు ఆయన కూడా విస్తుపోయారు! కనీసం సభా మర్యాద ఉండక్కరలేదా? ఒక్కసారి ఊహించండి.. అదే మంత్రి ప్లేసులో ఇంకెవరైనా కాస్త అహమున్న వీవీఐపీ ఉండి ఉంటే..? రచ్చ రచ్చ అయ్యేది కాదా..? అవునూ, ఝాన్సీ..? ఇదేం పిచ్చి పని..?! దీన్నే మూర్ఖత్వం అని కూడా అంటారమ్మా.. ఇన్నాళ్లూ నీమీద కాస్త సదభిప్రాయం ఉండేది..!!

- ముచ్చట సౌజన్యంతో..



ఒక్క మొబైల్ క్లిక్ తో ప్రపంచాన్నే చుట్టేసే నాగరికత మన సొంతం. కానీ, స్మార్ట్ మొబైల్ ఎలా పని చేస్తుందో కూడా తెలియని అనాగరికత ఆ గిరిజన గ్రామాల వెనుకబాటుతనం. అలాంటి అనాగరిక స్థాయి నుంచి ఇప్పుడు అదే స్మార్ట్ మొబైల్ తో డిజిటల్ విప్లవాన్ని ఉపయోగించుకుని తమ జీవితాలను, గిరిజన గూడాలనే సుసంపన్నం చేసుకుంటున్న ఆదివాసీల కథ ఇది. కరాగ్రే వసతే లక్ష్మీ కరమధ్యే సరస్వతీ కరమూలే స్థితాగౌరీ ప్రభాతే కర దర్శనం అని మనం ఉదయాన్నే ఆ ముగ్గురమ్మలైన లక్ష్మీ సరస్వతీ గౌరీల అనుగ్రహముండాలని చేయికి మొక్కుకుని మంచంలోంచి లేవడం చిన్నప్పుడు పెద్దలు నేర్పించిన ఓ శ్లోకం. అయితే, ఇప్పటి లోకానికి ఆ శ్లోకం తెలుసో, లేదోగానీ లేవగానే మొట్టమొదట ప్రభాతే మొబైల్ దర్శనమన్నట్టుగా తయారైంది పరిస్థితి. సోషల్ మీడియా మాయలో పడి ప్రతీ ఒక్కరూ ఎంతో కొంత ప్రభావితమవుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఫింగర్ టిప్స్ మీద మనకన్నీ సంపాదించి పెడుతున్న మొబైల్ తో మానవ జీవితమిప్పుడు విడదీయరాని బంధాన్ని పెనవేసుకుంది. అయితే, ఏ సాంకేతికతైనా దాని వాడకాన్ని బట్టి మనకు మంచి చేస్తుందా.. చెడు చేస్తుందా అన్నది ఆయా వ్యక్తిత్వాల మీద ఆధారపడి ఉంటుంది. అలా మొబైల్ ను తమ తలరాతలు మార్చే టూల్ గా మార్చుకున్నారు ఆ గిరిజనులు.

# డిజిటల్ మీడియాతో తమ తలరాతలను మార్చుకుంటున్న మహారాష్ట్ర గిరిజనం!

అవునూ, ఇవాళ మొబైల్ చేతిలో ఉన్న ప్రతీ ఒక్కరూ ఓ సామాజిక జర్నలిస్టే. కానీ, దాన్ని ఎంత సమర్థవంతంగా ఉపయోగిస్తున్నాం.. ఏ అంశాల పట్ల స్పందిస్తున్నాం.. ఏ విధంగా స్పందిస్తున్నామన్నదాన్ని బట్టి వాటికి ఆదరణ దక్కుతుంది. అలాంటి ఆదరణే ఇప్పుడు కొన్ని గిరిజన పల్లెల కథలను మార్చేస్తోంది.

మహారాష్ట్రలోని నందూర్ బార్ జిల్లాలో పురుడుపోసుకున్న ఆదివాసీ జనజాగృతి అనే సంస్థ గిరిజన సమాజాలను చైతన్యవంతం చేస్తోంది. మొబైల్ జర్నలిజంలో ఆయా గిరిజన గ్రామాల యువతకు తర్ఫీదునిస్తూ.. వారి స్థానిక మాతృభాషలో వారి ఊళ్లల్లోని సమస్యలను వీడియోల రూపంలో నమోదు చేస్తూ మెల్లిమెల్లిగా నిశ్శబ్ద విప్లవాన్నే తీసుకొచ్చింది. వారు రూపొందించిన వీడియోలు వైరల్ గా మారి ప్రభుత్వాలు దిగిరాక తప్పని పరిస్థితులను కల్పిస్తున్నాయి. ఏకంగా వారిని వాళ్ల గిరిజన గూడాల వైపు కదిలిస్తున్నాయి.

## ఆదివాసీ జనజాగృతి ఆవిర్భావం కథేంటి..?

2016లో నితేష్ భరద్వాజ్ అనే వ్యక్తి ఫెలోషిప్ కార్యక్రమంలో భాగంగా ధడ్ గావ్ అనే గ్రామానికి వెళ్లాడు. స్వతహాగా ఫిల్మ్ మేకర్ అయిన నితేష్.. అక్కడి స్థానిక హైస్కూల్ విద్యార్థులకు మొబైల్ ఫోన్స్‌ను ఎలా ఉపయోగించాలి.. వీడియోలను ఎలా షూట్ చేయాలి, ఎడిట్ చేయాలో నేర్పించాడు. అలా వారి మొదటి ప్రాజెక్ట్ జీరో-బడ్జెట్ తో ప్రారంభమైంది. ఆ ఆదివాసీ పిల్లలు షూట్ చేసిన ఓ వీడియో ఊహించని స్థాయిలో వైరలైంది. అదిగో అక్కడి నుంచే ఆదివాసీ జనజాగృతి సంస్థకు అంకురార్పణ జరిగింది.

## ఇంతకీ ఏం వీడియో అది..?

బాల కార్మికులను హైలైట్ చేస్తూ రూపొందించిన వీడియోతో ధడ్ గావ్ పాలకులతో పాటు, పౌరసమాజం దృష్టిలో పడింది. దాంతో తమ సమస్యల్ని కథలుగా మల్చి వాటికి దృశ్యరూపం ఇస్తే ఏం జరుగుతుందో ఆ గ్రామప్రజలైన గిరిజనులకు రుచి దొరికింది.

నితేష్ స్థానికంగా ఉండే రాకేష్, అర్జున్ పవార్‌లతో జతకట్టాడు. స్థానిక సమస్యలను ముందు గుర్తించారు. వాటిని చర్చించారు. వాటికి ఓ స్క్రిప్ట్ ప్రకారం దృశ్యరూపమిచ్చారు. పవారి, భిలోరి, అహిరాని వంటి స్థానిక గిరిజన భాషల్లో ఆ వీడియోలకు రూపకల్పన చేశారు.

ముఖ్యంగా బాలకార్మిక వ్యవస్థ, పారిశుధ్యం, పరిశుభ్రత, అవినీతి, పాలన, ప్రభుత్వ పథకాలను తెలుసుకోవడం వంటి అంశాల పట్ల ఫోకస్ చేశారు. అలాంటి అంశాలనే తమ షార్ట్ ఫిల్మ్ కు, డాక్యుమెంటరీస్ కు కథాంశాలుగా మల్చుకున్నారు. వాటిని గ్రామ సభల్లో ప్రదర్శించారు. ఇంకేం అవి చర్చలకు దారితీశాయి. మరింత మంది ముందుకొచ్చారు. ఆ స్ఫూర్తి ధడ్ గావ్‌తో పాటు.. చుట్టు పక్కల గిరిజన గ్రామాలకూ పాకింది.

పాలకుల దృష్టికి నోచుకోకుండా విసిరివేయబడ్డట్టున్న గిరిజన గూడాలు, ప్రభుత్వాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఆయా గిరిజనులు రూపొందించే వీడియో స్టోరీస్ వారధిగా మారాయి. ఈ మొత్తం గిరిజన చైతన్యంలో జనజాగృతిది ప్రధాన పాత్ర.



ఆంఖేడీ అనే గిరిజన గూడెంలో మహిళలు ప్రతీరోజూ కిలోమీటర్ల మేర నడిచి నీటిని తీసుకువస్తుంటారు. ఆ సమస్యను హైలెట్ చేసే వీడియోతో అధికారగణం కదిలివచ్చింది. ఆ గిరిజన గూడంలో ఏకంగా ఆరు బోర్ వెల్ లను ఏర్పాటు చేసింది. ఇక మౌలిక సదుపాయాలపై చేసిన మరో వీడియోతో ఉమ్రానీ అనే మరో గిరిజన గూడానికి పెండింగ్ ప్రాజెక్ట్ గా నిల్చిపోయిన రోడ్డు పూర్తైంది. ఇక ధవ్ గాడ్ లో పదహారేళ్లుగా సాకారానికి నోచుకోని వంతెనను ఏకంగా 47 కోట్ల రూపాయలతో నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ విజయాలన్నీ అసలు ప్రభుత్వాలే పట్టించుకోని.. ప్రభుత్వాలివన్నీ చేస్తాయన్న కనీస అవగాహన లేని ఊళ్లకు సకల సౌకర్యాలనూ కల్పిస్తున్నాయి. మొత్తంగా ఆయా సమాజాలు, ప్రభుత్వం మధ్య ఉన్న అంతరాన్ని చెరిపేస్తున్నాయి.

ఆదివాసీ జనజాగృతి అనే సంస్థ ఇప్పుడు కేవలం మొబైల్ వీడియోస్ షూట్ చేసి, ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయించడమే కాదు.. అక్కడి ఆదివాసీల్లో నాయకత్వాన్ని పెంపొందిస్తోంది. రాజకీయ భాగస్వామ్యముంటేనే ఏదైనా సాధించగలమని.. అంబేద్కర్ చెప్పినట్టు అదే మాస్టర్ కీ అని తెలియజెప్పి.. పద్నాలుగు మంది జనజాగృతి సభ్యులను స్థానిక ప్రభుత్వ పదవులకు ఎన్నికయ్యేలా కృషి చేసింది. వారి కాళ్లమీద వారే గట్టిగా నిలబడాలంటే ఇవన్నీ అవసరమనే ఒక సోయిని ఆయా గిరిజన గ్రామాల్లో తీసుకొస్తోంది జనజాగృతి. దాంతోపాటే, మహిళా సాధికారితనూ ప్రోత్సహిస్తూ వారినీ రాజకీయాల్లోకి తీసుకొస్తోంది. వారి సమస్యలనూ గ్రామసభల్లో వినిపించేలా.. వారి వాణిని గట్టిగా చాటేలా అవగాహన కల్పిస్తోంది.

## గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపుతున్న జనజాగృతి!

జనజాగృతి ఇప్పుడు 170 గిరిజన గ్రామాల్లో పనిచేస్తోంది. 47 మందికి శిక్షణనిచ్చి వారి నాయకత్వంలో వారి రాతను వారే మార్చుకునే స్వయంసమృద్ధివైపు అడుగులేయిస్తోంది. ఇప్పుడు ఈ గిరిజన గ్రామాల వ్యవహారం కేవలం మహారాష్ట్రకు మాత్రమే పరిమితమైన విషయంగా మిగిలిపోలేదు. అజీమ్ ప్రేమ్జీ ఫౌండేషన్ తో పాటు.. గూగుల్ న్యూస్ ఇన్షియేటివ్, యూట్యూబ్ ఇండియా వంటి సంస్థల నుంచి కూడా వీరికి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ఈ విజయాలన్నీ వారిని వారు సమర్థవంతమైన, సుభిక్షమైన జీవితాలను అనుభవించేందుకు దోహదపడుతున్నాయి.

అయితే, తమ గిరిజన గ్రామాలన్నీ ఏవో ప్రపంచ ప్రసిద్ధి చెంది ఏదో సాధించాలన్న తపనేం లేదంటున్నారు అక్కడి జనజాగృతిలో కార్యకర్తలైనవారు. కేవలం తమ ధడ్ గావ్ తో పాటు.. చుట్టుపక్కల గిరిజన పల్లెలన్నీ సుసంపన్నమైతే చాలంటున్నారు.

మొత్తంగా మొబైల్ ఫోన్స్ లో వచ్చే మెస్సేజులను అనుసరించి లోన్ యాప్స్ కు బలవ్వడం, అప్పులబారిన పడటం, ఇతర వీడియో గేమ్స్ తోనూ ప్రాణాలు పోతున్న ఘటనలు చూస్తున్న కాలంలో.. అదే మొబైల్ ను సరిగ్గా సమర్థవంతంగా ఉపయోగించుకోగల్గితే ఏం జరుగుతుందో చెప్పే ఒక నమూనాగా ఇప్పుడు మహారాష్ట్రలోని ధడ్ గావ్ చుట్టుపక్కల పల్లెలు నిరూపిస్తున్నాయి.

**చివరగా: మన తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి కథలను బాహ్యప్రపంచానికి తెలియపరుస్తున్న రూరల్ ఇండియా ఛానల్ కు కూడా ఈ సందర్భంగా అభినందనలు.**

- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## యోగా జీవితంలో ఒక భాగం కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగా జీవితంలో ఒక భాగం కావాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు అన్నదొరై వెల్లడించారు. 80 అడుగుల రహదారిలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాసనాలు వేయడం వలన క్రమశిక్షణ అలవడుతుందన్నారు. యోగాసనాలు వేయడం వలన ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతీరోజు యోగాసనాలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, ఆయుష్ శాఖ నుండి చంద్రశేఖర్, యోగా శిక్షకులు పాండ్రంకి మురళీకృష్ణ, తంగి స్వాతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, శ్రీకాకుళం (పెద్దపాడు)లో పలు తరగతులలో ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బండి లవకుమార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అడ్మిషన్ కోరుకునే వారు జూన్ 16వ తేదీలోపు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 3గంటల మధ్య పాఠశాలను నేరుగా సంప్రదించవచ్చన్నారు. అందుబాటులో ఉన్న ఖాళీల వివరాలు ఇలా ఉన్నాయి 4వ తరగతిలో కేవలం ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారన్నారు. మరింత సమాచారం కోసం, పాఠశాల అధికారిక మెయిల్ (kvsrikakulam@gmail.com) ద్వారా లేదా నేరుగా పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించవచ్చు.

## శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయాన్ని రక్షించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక యుటిఎఫ్ భవన్‌లో శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటీ సమావేశం అధ్యక్షులు కరణం బుచ్చి సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధాన కార్యదర్శి తమరి వైకుంఠరావు మాట్లాడుతూ నిరుద్యోగులకు విద్యార్థులకు పోటీ పరీక్షల సన్నద్ధం అయ్యేందుకు పరిశోధనలకు, అధ్యయనానికి నిలయంగా ఉన్న శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయాన్ని పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత నిరుద్యోగులు విద్యార్థులు విద్యావేత్తలు ప్రజానీకం అందరిపై ఉందని పిలుపునిచ్చారు. అధ్యక్షులు కరణం బుచ్చి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ చరిత్ర కలిగిన కేంద్ర గ్రంథాలయాన్ని ప్రైవేటుపరం చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన సముదాయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రతిపాదనలని సమావేశం తీవ్రంగా ఖండించింది. ఈ ప్రతిపాదన అత్యంత అభివృద్ధినిరోధకమైనది, తిరోగమన మార్గంలో వెళ్లేదని సమావేశం అభిప్రాయపడింది. గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తికే విఘాతం కలిగిస్తుందని పేర్కొంది. ఈ గ్రంథాలయం వందలాదిమంది పాఠకులు నిత్యం వస్తూపోతూ ఉంటారన్నారు. అనేక గ్రంథాలు, పేపర్లని నవలల్ని అధ్యయనం చేస్తుంటారన్నారు. వారి విజ్ఞాన సముపార్జన ప్రక్రియకు ఇది తీవ్ర ఆటంకం కలగజేస్తుందన్నారు. అంతేగాక వందలాదిమంది నిరుద్యోగ యువతీ యువకులు ఈ గ్రంథాలయ రీడింగ్ రూములలో పోటీ పరీక్షలకి సన్నద్ధం అయ్యేందుకు వినియోగించుకుంటున్నారన్నారు. వారికిది గొప్ప సౌకర్యంగా ఉందని, బయట రీడింగ్ రూములలో వేలకు వేలు ఫీజులు చెల్లించి చదువుకోలేని నిరుద్యోగ యువతకు ప్రభుత్వపరంగా ఈ గ్రంథాలయం ఉపయోగపడుతుందన్నారు. ఈ గ్రంథాలయం భవన సముదాయం అన్యాక్రాంతమైతే ఈ నిరుద్యోగ యువతకు అది అశనిపాతం అవుతుందన్నారు. ఈ కారణాల రీత్యా గ్రంథాలయ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన సముదాయాన్ని అన్యాక్రాంతం చేయొద్దన్నారు. గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని, ఆధునికరించాలని డిమాండ్ చేశారు. గ్రంథాలయ సంస్థ నిధులతో శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయం వారు ఎకరా భూమి 1970లో కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టారన్నారు. అప్పటినుంచి వేలమంది పాఠకులకు, నిరుద్యోగ యువతకు చదువుకోనేందుకు, పోటీ పరీక్షలకు ఉపయోగపడుతోందన్నారు. కళా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇటువంటి గ్రంథాలయంను అభివృద్ధి పేరుతో, ఉన్న భవనాలను పడగొట్టి కొత్తగా 4 ఫ్లోర్లు నిర్మిస్తామని అందులో ఒక ఫ్లోర్ గ్రంథాలయంకు కేటాయించి మిగిలిన 3 ఫ్లోర్‌లను ప్రైవేట్ వారికి అప్పగిస్తామని చెబుతున్నారని, ఇది ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒక సంవత్సర కాలంలో తిరిగి అప్పగిస్తారని, ఈలోపుగా ఆర్ట్స్ కాలేజీకి కేంద్ర గ్రంథాలయంను తాత్కాలికంగా తరలిస్తారని చెబుతున్న సందర్భంలో అక్కడ కళాశాలలోనే సరైన వసతులు లేకుండా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో గ్రంథాలయ పాఠకులతోపాటు ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులకు కూడా పరిస్థితి పెనం మించి పొయ్యిలో పడినట్లు అవుతుందన్నారు. డిఎస్సీతో పాటు సమీపకాలంలో జరగబోతున్న పోటీ పరీక్షల తరుణంలో వేలాదిమంది నిరుద్యోగ, విద్యార్థులకు ఇది తక్షణ శాపంగా మారనుందన్నారు. ప్రభుత్వ ధనాన్ని కొత్త ఆస్తిని సృష్టించడా నికి బదులుగా ఉన్న కేంద్ర గ్రంథాలయ ఆస్తిని అభివృద్ధి పేరుతో ప్రైవేట్ వారికి అప్పగించడం మోసపూరిత చర్య, ప్రజలకు నష్టదాయకమైనదన్నారు. సమావేశంలో గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్ష కార్యదర్శులు ఎం.ప్రభాకర్, పి.సుధాకర్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పేకల తేజేశ్వరరావు, జన విజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, జెవివి సమత, కో-కన్వీనర్ తంగి ఎర్రమ్మ, గ్రంథాలయ ఉద్యోగ సంఘ నాయకులు ఉగ్రసేన, చిరంజీవి తదితరులు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కోసం జరిగే పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని తెలిపారు.

## కేశవరెడ్డి విద్యాసంస్థలలో పుస్తకాల పేరుతో దోపిడీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అరసవిల్లి జంక్షన్, ఎచ్చెర్లలో ఉన్న కేశవరెడ్డి విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫాం అమ్ముతున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి డి.చందు ఆరోపించారు. ఈమేరకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలను విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చర్యలు తీసుకోవాల్సిందిపోయి విద్యాశాఖ అధికారులు, విద్యాసంస్థలకు దాసోహం చేస్తుందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు మండల విద్యాశాఖ అధికారులు అందరు కూడా మంత్రి నారాయణ ప్రభుత్వం అధికారంలో ఉంది కదా మేము తాము ఏం చేయగలమన్న ధోరణితో ఉన్నారు తప్ప రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తామని మాత్రం ఆలోచించడం లేదన్నారు. తక్షణమే శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, స్టేషనరీ పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్న చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలకు అదేశించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. వేలాది ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గుర్తింపు లేని విద్యాసంస్థల జాబితాను విడుదల చేయాలన్నారు. చర్యలు తీసుకొని పక్షంలో డిఇఓ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు భరత్ భవనం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# రక్తదానంపై విద్యార్థులకు అవగాహన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నారాయణ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్‌లో విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి నారాయణరావు మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్, ఎనీమియా, డయాలసిస్ తదితర కేసులు జిల్లాలో పెరుగుటం వలన జిల్లాలో రక్తం కొరత అధికంగా ఉందని, దీనిని అధిగమించడానికి అన్ని వ్యవస్థలు చేయి చేయి కలిపి రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి మహిళలకు ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలని, అర్హులందరు స్వచ్ఛంద రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, ఎన్.ఉమాశంకర్ రక్తదానం ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




# కొలిక్కొవచ్చిన 'సెమాగ్లుటైడ్' చోరీ కేసు

(మొదటిపేజీ తరువాయి)

ప్రొడక్ట్ చోరీ కేసులో నిందితుడిగా ఉన్నట్టు తెలిపారు. ప్రొడక్ట్‌ని సురేష్ రెడ్డి ద్వారా విక్రయించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. సురేష్ రెడ్డి కూడా ప్రొడక్ట్‌ని నిర్ణీత సమయంలో విక్రయించలేకపోవడంతో బాలకృష్ణ, నవీన్ కుమార్‌ను హైదరాబాద్ పంపించి ప్రొడక్ట్ తీసుకుని రావాలని సూచించారు. అయితే సురేష్ రెడ్డి ఒరిజినల్ ప్రొడక్ట్‌ను ఉంచుకొని, డూప్లికేట్ ప్రొడక్ట్‌ను వీరికి ఇచ్చి పంపించేశాడు. ఒరిజినల్ ప్రొడక్ట్‌తో పాటు డూప్లికేట్ ప్రొడక్ట్‌ను విక్రయిస్తున్న క్రమంలో ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ఎనిమిది నెలల క్రితం డాక్టర్ రెడ్డీస్‌లో రూ.60 లక్షలు విలువైన 3.38 కేజీల పెల్లాడియం అసిటెట్ కెమికల్ ప్రొడక్ట్ దొంగతనం చేశారని తెలిపారు. ఈ ప్రొడెక్ట్ పూర్తిగా అతి విలువైన రా మెటీరియల్ అన్నారు. ఈ మెటీరియల్‌ను రికవరీ చేయవలసి ఉందని, దీన్ని నిందితులు నుంచి రికవరీ చేస్తామని ఎస్పీ తెలిపారు. సీసీ కెమెరాలు పరిశ్రమల పరిసరాలతో పాటు అంతర్గతంగా ఏర్పాటు తప్పనిసరి చేయాలని పరిశ్రమ యాజమాన్యాలకు ఎస్పీ సూచించారు. పరిశ్రమలు, లేబొరేటరీస్‌లో ఉద్యోగులు పనిచేసిన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వీటి ఏర్పాటు వల్ల నేర నియంత్రణకు అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా కేసును ఛేదించి, నిందితులను చాకచక్యంగా అరెస్టు చేసి ప్రాపర్టీ పూర్తిస్థాయిలో రికవరీ చేయడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కెవి రమణ, డీఎస్పీ సిహెచ్ వివేకానంద, సిఐ ఎం.అవతారం, ఎస్సైలు చిరంజీవి, లక్ష్మణరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# జీవోలో సొమ్ములు.. కాంట్రాక్టర్ జేబుకు చిల్లులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం గ్రామాల్లో జరుగుతుందీ అంటే.. అది ఉపాధిహామీ పథకం వల్లే. ఇందులో రెండు కేటగిరీలు ఉంటాయి. ఒకటి లేబర్ కాంపొనెంట్. అంటే కనీసం 100 రోజులు పని కల్పించాలనే లక్ష్యంతో చెరువులు, గుంతలు తవ్వుతున్న కూలీలకు వేతనాలు ఇవ్వడం. రెండోది మెటీరియల్ కాంపొనెంట్. ఇందులో గ్రామాలకు అవసరమైన రోడ్లు, కాలువలతో పాటు పశువుల శాలలు నిర్మించడం. ఇందులో లేబర్ కాంపొనెంట్‌లో భాగంగా నిధులు మంజూరవుతున్నా మెటీరియల్ కాంపొనెంట్ కింద చేస్తున్న పనులకు సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలేదు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా ఐదేళ్లలో ఇదే పని చేసింది. దీంతో కాంట్రాక్టర్లు పనులు చేయలేమంటూ చేతులెత్తేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మాత్రం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మెటీరియల్ కాంపొనెంట్ కింద జరుగుతున్న పనులకు సంబంధించి ప్రతీ వారం బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామాల్లో అనేక చోట్ల తారు, సిమెంట్ రోడ్లతో పాటు కాలువలు కూడా నిర్మిస్తున్నారు. తొలినాళ్లలో ప్రతీవారం బిల్లులు జమ కావడంతో రెట్టించిన ఉత్సాహంతో జడ్పీ ఆమోదించిన కోట్లాది రూపాయల పనులకు కాంట్రాక్టర్లు కార్యరూపం ఇచ్చారు. కానీ గత ఏడాది డిసెంబరు రెండో వారం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం రూపాయి కూడా చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో రూ.2,500 కోట్లు ఇందుకోసం విడుదల చేసినట్లు జీవో రావడంతో కాంట్రాక్టర్లు కొంత మేరకు బిల్లుల చెల్లింపు జరుగుతుందని భావించారు. కానీ జిల్లాల వరకు ఆ సొమ్ము చేరలేదని తేలడంతో ప్రభుత్వం జీవో అయితే ఇచ్చింది కానీ, సొమ్ములు మాత్రం విదల్చలేదని తెలుసుకొని లబోదిబోమంటున్నారు. మరో నెల రోజుల్లో తల్లికి వందనం పేరిట ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఒక పథకాన్ని అమలుచేయనుంది. దీంతో ఈ నిధులను అటువైపు మళ్లించారా? అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు ప్రభుత్వం కూడా ఉపాధిహామీ పథకంలో మెటీరియల్ కాంపొనెంట్ పనుల మంజూరుపై ఆచితూచి వ్యవహరించాలని భావిస్తోంది. ఈమేరకు కలెక్టర్లకు కూడా దిశానిర్దేశం చేసినట్టు భోగట్టా. రాష్ట్రవ్యాప్తంగా రూ.2,200 కోట్ల పెండింగ్ బిల్లుల సమస్య తీరాకే కొత్తవి మంజూరు చేయాలని, అప్పటి వరకు కలెక్టర్ల పరిశీలనలోనే పనుల ప్రతిపాదన ఉండాలని సూచించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆలస్యమయ్యాయి. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డైరెక్టర్ ఇప్పటికి నాలుగు సార్లు ఢిల్లీ వెళ్లి పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. ఎందుకంటే ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వం మీద తీవ్ర ఒత్తిడి ఉంది. నిధులు విడుదల కాకపోవడం, వర్షాలు ముందుగా రావడంతో ఆదరాబాదరాగా పనులు చేపట్టకూడదన్న ఉద్దేశంతో కొత్త పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంలేదు. వాస్తవానికి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రణాళిక ప్రకారం ఏప్రిల్ నుంచే కొత్త పనులు మొదలవ్వాలి. అన్ని చెల్లింపులు సరిగా జరిగుంటే ఈ ఏడాది 4వేల కిలోమీటర్ల రహదారి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అదే జరిగితే రాష్ట్రంలో గ్రామీణ రహదారులన్నీ బాగైనట్టే. లేబర్ కాంపొనెంట్ కింద పనులు చేపట్టిన కూలీలకు రెండు నెలలు జీతాలు ఇవ్వలేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే దీన్ని సర్దుబాటు చేసింది. ఇందుకోసం రూ.60 కోట్లు వెచ్చించింది. కానీ మెటీరియల్ కాంపొనెంట్ పరిస్థితి అలా కాదు. ఎందుకంటే.. సంబంధిత నిర్మాణ పనులకు మెటీరియల్ సరఫరా చేసేవారు వెండర్ల కింద రిజిస్టర్ అయ్యారు. ఇందుకు సంబంధించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలోనే వేస్తుంది. గతంలో ఈ సొమ్ములు పంచాయతీకి వచ్చేవి. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం ముందుగా చెల్లించి పంచాయతీ ఖాతాలో జమైనప్పుడు వెనక్కు తీసుకునేది. 2019 నుంచి ఆ పరిస్థితి లేదు. అందుకే ప్రభుత్వం లేబర్ కాంపొనెంట్‌కు నిధులు సర్దుబాటు చేసినట్లు మెటీరియల కాంపొనెంట్‌కు చేయలేకపోతోంది. ఇక జిల్లాలో ఈ కేటగిరీలో సమగ్రశిక్ష, రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, బీఆర్ఆర్ ప్రాజెక్ట్ శాఖలు 6311 పనులు చేపట్టాయి. ఇందులో ఇప్పటి వరకు 4018 గ్రౌండ్ అయ్యాయి. అందులో 2274 పనులు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి రూ.91కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.19కోట్లు మాత్రమే చెల్లించారు. దీంతో ఎన్ఆర్ఈజీఎస్ పనులను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం తాజాగా ఈ నెల 6న ఇచ్చిన జీవో మేరకు నిధులు విడుదల చేసినా మిగిలిన పనులు పూర్తవుతాయి.

# కన్నుల పండువగా త్రిశూల తీర్థస్నాన ఘట్టం



సత్యంన్యూస్, శ్రీకాకుళం

జిల్లా కేంద్రంలోని గుడివీధి ప్రాంతంలో వెలసి ఉన్న ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీ ఉమారుద్రకోటేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలు బుధవారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలోని మండపంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు ఆరవెల్లి హరిగోపాలశర్మ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి శర్మ, ఆరవెల్లి చంద్రశేఖర శర్మల ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఏడు రోజులు పాటు పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆఖరి రోజు బుధవారం శివపార్వతుల విగ్రహమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. అనంతరం నాగవళి నదిలో శివపార్వతులకు మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ త్రిశూల తీర్థ స్నానం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మునగవలస సుకన్య, సీనియర్ గుమస్తా సింగూరు నాగేశ్వర రావు, ఆలయ అర్చకులు, లలితా మండలి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.








## యూపీఐ చెల్లింపులు

# రూ.3 వేలు దాటితే ఛార్జీలు!




### యోచనలో కేంద్రం

**న్యూఢిల్లీ:** యూపీఐ లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. కిరాణా దుకాణంలో చిన్న వస్తువుల్ని కొనుగోలు చేయాలన్నా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తరహా పేమెంట్స్‌పై ఎటువంటి ఛార్జీలు లేవు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను ప్రవేశపెట్టాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఎన్‌డీటీవీ ప్రాఫిట్ తన కథనంలో వెల్లడించింది.

అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో వీటికి సహకరించాలనే లక్ష్యంతో ఎండీఆర్ ఛార్జీలను విధించాలని కేంద్రం భావిస్తోంది. వ్యాపారుల వార్షిక ఆదాయం ఆధారంగా కాకుండా, లావాదేవీ విలువ ఆధారంగా ఎండీఆర్ విధించేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. యూపీఐ ద్వారా రూ.3,000కు పైబడిన లావాదేవీలపై ఈ ఛార్జీలు విధించే యోచనలో ఉంది. అంటే 2020 జనవరి నుంచి అమల్లో ఉన్న జీరో ఎండీఆర్ పాలసీకి స్వస్తి పలకాల్సి ఉంటుంది.

చిన్న మొత్తం యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు మినహాయింపు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, అధిక విలువ గల లావాదేవీలపై త్వరలోనే మర్చంట్ రుసుము విధించనున్నారు. పెద్ద వ్యాపారులపై 0.3 శాతం ఎండీఆర్ విధించాలని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. ప్రస్తుతం క్రెడిట్, డెబిట్ కార్డులపై ఎండీఆర్ 0.9 శాతం నుంచి 2 శాతం వరకు ఉన్నాయి. రూపే కార్డులపై ప్రస్తుతానికి ఎండీఆర్ విధించే ప్రసక్తి లేదని సమాచారం. బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ వంటి వాటాదారులతో సంప్రదింపుల అనంతరం ఒకటి లేదా రెండు నెలల్లో యూపీఐ లావాదేవీలపై రుసుము విధించే విషయంపై నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని సమాచారం.

### యూజర్లపై ప్రభావం ఉంటుందా?

ఎండీఆర్ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావాదేవీల కోసం యూజర్లనుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.




## ఇకపై ఆధార్ వెరిఫైడ్ యూజర్స్‌కి మాత్రమే

# తత్కాల్ బుకింగ్

**న్యూఢిల్లీ:** రైలు ప్రయాణం కోసం తత్కాల్ టికెట్ బుకింగ్‌లో రైల్వేశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఐఆర్‌సీటీసీ యాప్/వెబ్‌సైట్‌లో ఆధార్ వెరిఫైడ్ యూజర్లకు మాత్రమే తత్కాల్ టికెట్ బుక్ చేసుకునే అవకాశముంటుందని రైల్వేశాఖ పేర్కొంది. ఈ నిబంధన జులై 1 నుంచి అమల్లోకి వస్తుందని వెల్లడించింది.




# 10 రోజులు ముందుగానే లక్ష్యాన్ని దాటిన యోగాంధ్ర

- 2 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న యోగాభిలాషులు
- ప్రజా స్పందనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షం

(సత్యంన్యూస్, అమరావతి)

రాష్ట్ర ప్రజల్లో యోగాభ్యాసం పట్ల అవగాహనను పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన నెల రోజుల యోగాంధ్ర కార్యక్రమం 10 రోజులు ముందుగానే నిర్దేశించిన లక్ష్యాలను దాటి ముందుకు సాగుతోంది. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో మే 31న యోగాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే ప్రధాన కార్యక్రమంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా లక్షకు పైగా ఎంపిక చేసిన కేంద్రాల్లో 2 కోట్ల మంది యోగాభిలాషులు పాల్గొనే దిశగా రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ మేరకు నెల రోజుల పాటు సాగే యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలు కల్పించారు. 2 కోట్ల రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని అధిగమించి జూన్ 10 రాత్రి వరకు 2,04,64,831 యోగాభిమానులు, యోగాసక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. యోగా శిక్షకుల రిజిస్ట్రేషన్, వారి శిక్షణ, యోగా పోటీల నిర్వహణ, స్థలాల ఎంపికలో కూడా నెల రోజుల యోగాంధ్ర కార్యక్రమ లక్ష్యాలను దాటి ప్రగతి నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21న యోగా కార్యక్రమాల్ని చేపట్టేందుకు ఇప్పటికే 1,36,175 ప్రాంతాల రిజిస్ట్రేషన్ జరిగింది. రాష్ట్రంలో యోగా పట్ల వెల్లడవుతున్న భారీ ప్రజా స్పందనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షాన్ని వ్యక్తం చేశారు. దేశంలో యోగా వ్యాప్తిని ఉద్యమంలా చేపట్టి ప్రజలందరూ యోగాభ్యాసం చేసే దిశగా ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పం సాకారమవడానికి, రాష్ట్రంలో ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి యోగాంధ్ర పట్ల ప్రజా స్పందన అద్దం పడుతోందని మంత్రి తెలిపారు. జూన్ 10 రాత్రి వరకు జరిగిన యోగాంధ్ర కార్యక్రమ ప్రగతి వివరాల్ని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, యోగాంధ్ర రాష్ట్ర నోడల్ అధికారి ఎం.టి.కృష్ణబాబు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీకి నివేదించారు. జిల్లాకొక ఇతివృత్తం ఆధారంగా చేపట్టిన యోగా కార్యక్రమాలు ఇప్పటి వరకు 16 జిల్లాల్లో జరిగాయి. గుర్తించబడిన 100 పర్యాటక కేంద్రాల్లో ఇప్పటివరకు 62 చోట్ల యోగా కార్యక్రమాల్ని నిర్వహించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.